క్లుప్తంగా

ఏపి మోడల్ స్కూల్‌లో డిజిటల్ తరగతులు ప్రారంభం



జెట్టిపాలెం(రెంటచింతల): మండల పరిధిలోని జెట్టిపాలెం గ్రామ శివార్లో ఉన్న ఏపి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు డిజిటల్ తరగతులు ప్రారంభించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.పాపయ్య బుధవారం తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతి గదులను ప్రారంభించినట్లు తెలిపారు. నూతన టెక్నాలజీని వినియోగించుకుంటూ నిర్వహిస్తున్న ఈ డిజిటల్ తరగతుల వల్ల పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి ఈ తరగతులు దోహదపడతాయన్నారు. డిజిటల్ తరగతుల వల్ల విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమవుతాయని, ఆయా సబ్జెక్టులపై సమగ్ర అవగాహన ఉంటుందన్నారు.

ఆటో బోల్తా ఒకరు మృతి

పిడుగురాళ్ల: ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం...నల్లగొండ జిల్లా దామంచర్ల మండలం కొండ్రప్రోల్ గ్రామానికి చెందిన పుచ్చకాయల వెంకటేశ్వర్లు(70) అచ్చేపేట మండలంలోని సామర్తి గ్రామానికి వెళ్లేందుకు దాచేపల్లికి పిడుగురాళ్ల వచ్చే ఆటో ఎక్కాడు. మార్గం మధ్యలో బ్రాహ్మణపల్లి రామాలయం సమీపంలోని ఆటో వేగంగా వస్తుండడంతో కుక్క అడ్డం రావడంతో ఆటో డ్రైవర్ బాబు షడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో బోల్తా పడడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఆటోలో డ్రైవర్‌తో సహా ఆరుగురు ప్రయాణిస్తుండగా డ్రైవర్ బాబుతోపాటు వెంకటేశ్వర్లకు, పలువురికి గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలి

గురజాల : విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సంస్థ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురజాలలోని ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో పలు కీలక మార్పులు తీసుకువచ్చి సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులకు మెరుగైన భోజనంతో పాటు మంచి బోధన అందించే విధంగా ప్రణాళికలు రూపొందించిందన్నారు.

సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని కన్నె గంటి హనుమంతు భవనంలో సీఐయూటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కె. సీతరామయ్య అధ్యక్షత వహించగా జిలా కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ హాజరై మాట్లాడుతూ పట్టణంలోని కార్మిక వర్గ కేంద్రంగా సున్నం బట్టీలు, మిల్లులో, రైస్ మిల్లులో, భవన నిర్మాణ కార్మికులు అసంఘటిత కార్మికులు వేల సంఖ్యలో పని చేస్తున్నారని, వీరికి ఎలాంటి పని భద్రత లేక ప్రమాదాలు జరిగితే పట్టించుకునే నాధుడే లేక ఇబ్బందులుపడుతున్నారన్నారు. పర్యవేక్షించాల్సిన లేబర్ డిపార్ట్‌మెంట్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. ఈ ప్రాంతంలతో సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి కార్మికులకు అండదండగా సీఐటీయూ నిలియచిందని భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకోవడం కోసం నెల 12, 13వ తేదీల్లో జరిగే జిల్లా వర్క్ షాపు నిర్వాహణ కోసం ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని ఆయన పిలిపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివసారావు, బుంగా నాగేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, మున్సిపల్ కార్మికులు వీరమ్మ, కృష్ణవేణి, అనంత లక్ష్మీ, పంచాయితీకార్మికులు నాగేశ్వరరావు, ఏసుబాబు, మ్యాహ్న భోజన కార్మికులు పున్నమ్మ, బుజ్జి, నరసమ్మ, మేరి గ్రేసెస్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మహాసభను జయప్రదం చేద్దాం

మాచర్ల: ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టులో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జె నరసింహారావు, పల్నాడు జిల్లా నాయకులు గాడిపర్తి శ్రీనివాస మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం పంచాయతీరాజ్ అతిధి గృహంలో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం గత 20 సం''రాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నా ఎస్సీ వర్గీకరణ న్యాయం అంటూనే మాదిగ ఉప కులాలను మోసం చేస్తున్నారన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి

గురజాల : తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తల్లి పాలవారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రు పాలు తాగించాలన్నారు. తల్లిపాలు పిల్లలకు పట్టించాలని డబ్బా పాలు తాగించరాదన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించడం జరుగుతుందన్నారు. కార్యకమంలో డీఎల్‌డీఓ గబ్రూనాయక్, ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్, సీడీపీఓ షేక్ రుక్సానా సుల్తానా భేగం, సూపర్‌వైజర్ రత్న కుమారి తదితరులున్నారు.

రెంటచింతల: రాష్ట్రంలోని పేదలైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో పౌష్టికాహార లోపం, రక్తహీనతల నివారణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమం ఓ వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక ఆనందపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్యతో కలిసి వైఎస్సార్ పోషణ–టేక్ హోం రేషన్‌ను అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా పేద మహిళలకు, బాలింతలకు, చిన్నారులకు ప్రతి నెలకు 25 రోజులు రేషన్‌తో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారం కింద 30 గుడ్లు, ఆయిల్, పాలు, కందిపప్పు, రైస్‌ను అందచేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1,100 విలువైన పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నా రు. మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 629 మందికి ఈ పథకం కింద ప్రయోజనం కలుగుతుందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టం భాస్కర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణాలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందజేత

మాచర్ల రూరల్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని జమ్మలమడక గ్రామంలో బుధవారం ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంలో భాగంగా మూడు కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, అరకేజీ నూనె, పాలు, గుడ్లు, రెండు కేజీల ఆట గ్రైన్స్, కేజీ రాగి పిండి, ఖర్జూరాలు, అరకేజీ చిక్కీలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఎం సుజాత, సచివాలయ వెల్ఫేర్ జి హనుమంతు, అంగన్‌వాడీ టీచర్లు జి నాగేంద్రం, ఎస్ చిలకమ్మ, వి సీతమ్మ, కె నాగమణి, శేఖర్, శ్రీను, ఎంఎస్‌కె నాగలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి, మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసినట్లు ఎంపీపీ ఏచూరి సాయి శంకర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ను బాలింత, గర్భిణులకు అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని కొనియాడారు. పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే సంకల్పం గొప్ప కార్యక్రమమన్నారు. ఎంపీడీఓ కె సమతావాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న కిట్లను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకొని తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేంద్రం, ఎఓ శివప్రసాద్, ముటుకూరు సర్పంచ్ గొంది నాసరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాజు, ఐసిడిఎస్ సిబ్బంది, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలవారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, సిబ్బంది



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మాచవరం: ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జెడ్పీటీసీ శివాయాదవ్ అన్నారు. మండలంలోని వేమవరం గ్రామ డాక్టర్ వైఎస్సార్ వెలెనెస్ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అందించే సేవలు మరింత చేరువయ్యేందుకు టేక్ హోం రేషన్ కార్యక్రమం ద్వారా ఇంటికే సరుకులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.అన్నపూర్ణ, ఇన్‌చార్జి సర్పంచ్ గాదె కనకారెడ్డి, మాజీ సర్పంచ్ దొండేటి కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు పెరుగు రోశయ్య, గుర్రం గురవారెడ్డి, శానంపూడి కృష్ణారెడ్డి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం సంతోషకరమని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బాలింతలు, గర్భిణులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు, సిబ్బంది తదితరులున్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని కౌన్సిలర్లు షేక్ జానీ, ఉప్పు వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జోష్నాలు ప్రారంభించారు. అంగన్వాడీల ద్వారా లబ్ధిదారులకు ఇంటికి నేరుగా పోషకాహారాన్ని పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో కందులూరి శేషయ్య, నండూరి రవిబాబు, అంగన్‌వాడీ టీచర్ శ్రీ దేవి పాల్గొన్నారు.

4వ వార్డులో అంబేద్కర్ నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు, బాలింతలకు టెక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేశారు. 16వ వార్డులో అంగన్‌వాడీ స్కూల్‌లో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

దాచేపల్లి : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని చైర్మన్ కొప్పుల సాంబయ్య అన్నారు. నగర పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, ఐనాల శ్రీరాములు, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరి, సుమతీ, అనురాధ, పద్మ, ఆదిలక్ష్మీ, అరుణ, వసంత, భారతి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సంపూర్ణ కిట్లును పంపిణీ చేస్తున్న అధికారులు



వైఎస్సార్ పోషణ–టేక్ హోం రేషన్‌ను అందజేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



గర్భిణులు, బాలింతలకు పోషణ సరుకులు అందజేస్తున్న ఉద్యోగులు



బాలింతలకు కిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ ఏచూరి సాయి శంకర్, ఎంపీడీఓ సమతావాణి



పోషణ కిట్లు అందజేస్తున్న కౌన్సిలర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జోష్నా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కులమతాలకతీతంగా మేలు చేయటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలను ప్రతి పేద కుటుంబానికి అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 5వ వార్డులోని పిడబ్ల్యూడి కాలనీ, సుద్దగుంతల సచివాలయ పరిధిలో వార్డు కౌన్సిలర్ కలివెల జ్యోతి, ఆదిరాల జగన్నాధంల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ పీఆర్కే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీలతో పాటు అన్నీ వర్గాలకు మేలు చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలందరికీ ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందించి పేద కుటుంబాల్లో వెలుగు నింపుతున్నారన్నారు.

ఏ సంక్షేమ పథకమైనా అర్హతే ధ్యేయంగా తీసుకుని మంజూరు చేసి పారదర్శకంగా అందజేయడంలో జగనన్న ప్రభుత్వం ముందంజలో ఉందని పేర్కొన్నారు. అందులో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి అర్హత ఉండి పథకాలు పొందలేని వారు పథకాలు పొందే విధంగా చర్యలు తీసుకున్న మొట్టమొదటి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. 5వ వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ 354 గృహాలను సందర్శించి లబ్ధిదారులు ప్రభుత్వం ద్వారా చేకూరిన పథకాలను వివరించి కరపత్రాలను అందించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నేటి వరకూ వారి ఖాతాల్లో చూసుకుంటే వారికే తెలుస్తుందన్నారు. అభివృద్ధి చేస్తున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసునన్నారు. అర్హులై ఉండి పథకాలు రాని వారు ఉంటే పథకాలు మంజూరు చేయించే బాధ్యత తనదేనని పీఆర్కే అన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ బూదాల మరియమ్మ, ఆయా వార్డు కౌన్సిలర్‌లు షేక్ దస్తగిరి, పోలా శ్రీను, చంద్ర కుమార్, తేరాల సిద్దయ్య, మందా సంతోష్, జీవన్, అనంతరావమ్మ, యాసిన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గురజాల : అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురజాల మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన బుక్కిశెట్టి నాగేశ్వరరావు (36) 10 ఎకరాల పంటలో పత్తి, మిరప పంటను సాగుచేసి జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా పంట దిగుబడి రాకపోవడంతో అప్పుల బాధ ఎక్కువైంది. ఈ నేపథ్యంలో 9 ఎకరాలు అమ్మి అప్పులు తీర్చగా ఇంకా రూ.35 లక్షల మేరకు అప్పు మిగిలివున్నది. గత కొన్ని రోజులుగా అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మానసికంగా ఇబ్బందులకు గురైయ్యాడు. 1వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో పొలానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పొలం గట్టుపై పడుకుని ఉన్న నాగేశ్వరరావును అదే గ్రామానికి చెందిన పురంశెట్టి సురేష్ నర్సరీ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో నాగేశ్వరరావు పక్కనే పురుగుమందు డబ్బా కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. బంధువులు నాగేశ్వరరావును గురజాల ప్రైవేట్ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరుకు తరలించారు. గుంటూరు వైద్యశాలలో వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. భార్య సీతారావమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కాసు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న బుక్కిశెట్టి నాగేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ధైర్యం అందించి మట్టి ఖర్చుల నిమిత్తం నగదును అందించారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్

కారెంపూడి: గర్భిణులు బాలింతలు పోషకాహారం తీసుకోడానికి ఏ చిన్నపాటి ఇబ్బంది కూడా పడకూడదని ఇకపై ఈ రోజు నుంచి పోషకాహార కిట్స్‌ను వారి ఇళ్లకే వెళ్లి అందించే ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (పీవీఆర్) చెప్పారు. కారెంపూడిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం కార్యక్రమాన్ని కారెంపూడిలో బుధవారం పీవీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో పీవీఆర్ మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా కుటుంబపరంగా ఎదగాలనేదే జగనన్న ఆలోచన అన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమం, వారి ఆరోగ్యం, వారి పిల్లల చదువు ఇలా అన్ని అవసరాలను సొంత కుటుంబ సభ్యుడి మాదిరిగా జగనన్న తీర్చుతున్నారన్నారు. పిల్లలు శారీరకంగా బాగా ఎదగడానికి అలాగే తల్లులు, గర్భిణులు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా బాగా ఆరోగ్యంగా ఉండడానికి వారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్న బాలింతలు, గర్భిణుల కోసం ఇకపై వారికి ఆ కష్టం కూడా లేకుండా నేరుగా వారి ఇళ్లకే పోషకాహార కిట్స్‌ను ప్రభుత్వం అందించనుందన్నారు. ప్రభుత్వం మంచి కార్యక్రమం చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ గర్భిణులు, బాలింతల తరుపున అంగన్‌వాడీ టీచర్లు పీవీఆర్‌ను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ జి శ్రీనివాస్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాస రెడ్డి, సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, కొమ్ము చంద్రశేఖర్, పాతూరి రామిరెడ్డి, చిలుకూరి చంద్రశేఖర రెడ్డి, మందాళ్ల అంజిరెడ్డి, అంతరగడ్డ ఏసోబు తదితరులు పాల్గొన్నారు.



పోషణ కిట్‌ను పంపిణీ చేస్తున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం

తహసీల్దార్ జి శ్రీనివాసరావు

మాచర్ల రూరల్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పై బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి చేస్తున్న సర్వేల పై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ జి శ్రీనివాసరావు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 21 నుంచి ప్రతి ఇంటికి బూత్ లెవల్ అధికారులు సర్వే చేస్తున్నారని, ఈ సర్వేలో కొత్త ఓటర్లను చేర్చడంతో పాటు డబుల్ ఎంట్రీ, చనిపోయిన వారిని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించి తగు మార్పులు, చేర్పులు చేయనున్నట్లు చెప్పారు. బీఎల్ఓల సర్వేలలో ఏవైనా మార్పులు, చేర్పులుంటే తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ బూత్‌ల కన్వినర్ నర్రా వెంకటేశ్వరరావు, సిపిఐ, బీజేపీ, టీడీపీ నాయకులు బాబురావు, నాసరయ్య, శివ, డిటీ షేక్ బాషా, మస్తాన్ వలి, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ జి శ్రీనివాసరావు

పింగళి వెంకయ్యను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ జండా రూపకర్త పింగళి వెంకయ్యను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి అన్నారు. బుధవారం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక రెంటాల ఆటో స్టాండ్ సెంటర్లోనున్న స్థూపం వద్ద , మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వారు వెంకయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. జాతిపిత మహాత్మాగాంధీ సూచనల మేరకు వెంకయ్య జాతీయ త్రివర్ణ పతకాన్ని రూపొందించారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం గాంధీజీ ఆదేశాల మేరకు జాతీయ పతాకంలోని రాట్నం స్థానంలో అశోక చక్రం చేర్చబడిందన్నారు. నేటి తరం స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంత్ సేవాసంఘం నాయకులు నారాయణపురం శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ ముక్కావలి, యేచూరి వెంకటసైదయ్య, నాళం పెదబాబు, సూరపురెడ్డి పుల్లారెడ్డి, ఆకుల నర్సింహారావు, నాళంచిన్నబాబు, గాదె లూర్దుమర్రెడ్డి, పూజల వెంకటేష్, లిటిల్ ఎంజెల్స్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల: భారతదేశ తివర్ణ పతాకాన్ని రూపొందించిన స్వర్గీయ పింగళి వెంకయ్య సేవలు దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. బుధవారం పింగళి వెంకయ్య 147వ జయంతి సందర్భంగా కార్యాలయంలో వారు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. దేశానికి స్ఫూర్తిదాయకమైన పింగళి వెంకయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జన్మించడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. అదే విధంగా వారి కుటుంబం మాచర్లలో నివాసముండడం ఆయన ఖ్యాతిని అన్నీ ప్రాంతాలకు తెలియపరిచే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి వారి కుటుంబాన్ని వారు గుర్తు చేసుకున్నారు.

గురజాల : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ అన్నారు. స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రెంటాల నాగేశ్వరరావు కార్యాలయంలో బుధవారం జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణభట్ల సుబ్రమణ్యం, మద్దాలి రాంబాబు, దివాకరుని రాధకృష్ణమూర్తి, బ్రహ్మం , తదితరులున్నారు.



పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎంపీడీఓ

కౌలు రైతులకు కార్డులు

మాచవరం: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు అందించాలన్న లక్ష్యంతో భూములు కౌలుకు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు కౌలు రైతు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి కె.రామమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన రైతులకు ఈనెల 7 వరకు కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందించే కౌలు రైతు కార్డుల వలన రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పంటల బీమా. ఈ–క్రాప్ బుకింగ్ పథకాలు వర్తిస్తాయన్నారు. మండలంలో సుమారు 199 మంది రైతుల పేర్లు ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయని, వీలైనంత త్వరలో ఏకేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచామని, కంది సాగు చేసే రైతులకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు.

సొసైటి భూములు ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్నాయి

దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పలు సర్వేనంబర్లలో ఉన్న 75.44 ఎకరాల భూములు ఫ్యాక్టరీ ఆధీనంలోనే ఉండే విధంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆంధ్రా సిమెంట్స్ ఫ్యాక్టరీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఆంధ్రాసిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో 1982 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఈ భూములను తమకు స్వాధీనం చేశారని, 75.44 ఎకరాల భూములకు రూ. 6,78,960 మార్కెట్ ధరగా నిర్ణయించారని వారు వివరించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం ఫ్యాక్టరీకి అప్పగించిన భూముల్లో కొన్ని నిర్మాణాలు కూడా చేపట్టామని, కొన్ని అనివార్య కారణాల వల్ల మార్కెట్ ధర ప్రభుత్వంకు చెల్లించలేకపోయామని వారు చెప్పారు. భూములకు మార్కెట్ ధర చెల్లించేందుకు 2014లో ఆంధ్రా సిమెంట్స్ టెకోవర్ చేసిన జెపి సిమెంట్స్ యజమాన్యం భూములకు మార్కెట్ ధర చెల్లిస్తామని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలాలు చేశామని, అయితే ఈ భూములపై కొంతమంది కోర్టును ఆశ్రయించారన్నారు. భూముల్లో ఫ్యాక్టరీ నిర్మాణం జరగకపోతే సంబంధిత వ్యక్తులు అనుభవంలో ఉంటే వారిని తొలగించవద్దని 2022 డిసెంబర్‌లో కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, ఈ ఆదేశాలపై తాము తిరిగి రిట్ పిటిషన్ హైకోర్టులో దాఖలాలు చేయడంతో విచారణ జరిగిపిన న్యాయస్థానం ఈ భూములకు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం గత నెల 12వ తేదీన నిలిపివేసిందని, 75.44 ఎకరాల భూములు ఫ్యాక్టరీ ఆధీనంలోనే ఉన్నాయని ప్రతినిధులు వెల్లడించారు.

వలంటీర్ సేవా గుణం





కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామ వలంటీర్ బుస్సా రమేష్ సేవా గుణాన్ని చాటుకున్నాడు. ఆయన బుధవారం నర్సరావుపేట వెళ్లి అక్కడ హాస్పటల్‌లో ఉన్న ఇద్దరికి పింఛన్ అందించాడు. గ్రామానికి చెందిన వృద్ధురాలు బత్తుల మాణిక్యమ్మ ఇటీవల కింద పడడంతో నడుము దెబ్బతిని ఆమె నర్సరావుపేట ఏరియా ఆసుపత్రిలో గత వారం రోజులుగా మంచానికే పరిమితమై చికిత్స పొందుతోంది. ఆమెకు ఆమె కోడలు పాలడుగు విజయమ్మ ఆసుపత్రిలో తోడుగా ఉంటోంది. వారి వద్దకు రమేష్ వెళ్లి బయోమెట్రిక్ తీసుకుని మాణిక్యమ్మకు వృద్ధాప్య పింఛన్, విజయమ్మకు వితంతు పింఛన్‌లను అందించాడు. దీంతో పింఛన్ తీసుకోలేకపోతున్నామనే వారి బెంగను వలంటీర్ తీర్చాడు. ఖర్చులకు ఉపయోగపడే విధంగా వారికి పింఛన్ నగదును అందించాడు. వారికి కష్ట కాలంలో అండగా ఉన్నాడు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ దరియా అనారోగ్య కారణంగా గుంటూరులోని హాస్పటల్‌లో చికిత్స పొందుతుగా పట్టణానికి చెందిన వెలిశల లక్ష్మీ ప్రసన్న తన సొంత ఖర్చులు పెట్టుకుని గుంటూరు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న దరియాను పలకరించి దరియాకు రావాల్సిన పింఛన్ అతని వద్ద నుంచి తంబు తీసుకుని పింఛన్ నగదును అందజేసింది. దీంతో పట్టణ ప్రజలు ఆమెను అభినందించారు.